సమీకృత మార్కెట్ భవనంలో నిర్మించిన ప్లాట్‌ఫామ్‌లు

వెజిటేబుల్ మార్కెట్

వినియోగంలోకి వచ్చేనా?

శామకుంటలో ₹3కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ భవనం

- ₹3కోట్లతో పూర్తయిన భవన నిర్మాణం
- త్వరగా ప్రారంభించాలని రైతులు, వ్యాపారుల విజ్ఞప్తి

వేములవాడ, డిసెంబర్ 6: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆగస్టు 2023 లో వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌లో ₹3కోట్లతో వెజిటేబుల్ కూరగాయల మార్కెట్ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే పనులు ప్రారంభించిన వెంటనే ఎన్నికలు రావడంతో నిర్మాణ పనుల్లో కొంత ఆలస్యమైంది. దాదాపు 100మంది రైతులు, వ్యాపారులు కూర్చుండి చేసుకునే విధంగా అధునాతన వసతి సౌకర్యాలతో భవన నిర్మాణం పూర్తయింది. కూరగాయలను భద్రపర్చేందుకు కోల్డ్ స్టోరేజ్ వసతి సౌకర్యం కల్పించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన భవనాన్ని వినియోగంలోకి తేవాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

ఔట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

గన్నేరువరం, డిసెంబర్ 6: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాన్ టీచింగ్ ఉద్యోగాలకు (ఔట్ సోర్సింగ్) దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. స్వీపర్(డ్రై)1, స్వీపర్(వేట్)1 పోస్ట్‌కు ఏడో తరగతి, వాచ్ ఉమెన్(డే)1, వాచ్ ఉమెన్ (నైట్) 1 పోస్ట్‌కు ఏడో తరగతి, హెడ్ కుక్-1 పోస్ట్‌కు పదో తరగతి, అసిస్టెంట్ కుక్ 1 పోస్టుకు ఏడో తరగతి, అటెండర్ పోస్ట్1కు పదో తరగతి అర్హతగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆయా పోస్టులకు ఈ నెల 13లోగా బయోడేటాతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మానేటి లఘుచిత్ర పోటీలకు

ఎంట్రీల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 6 : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, కరీంనగర్ ఫిలిమ్ సొసైటీ, తెలంగాణ లఘు చిత్ర నిర్మాతల మండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మానేటి లఘు చిత్ర పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఫిలిం భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఫిలం సొసైటీ, లఘు చిత్ర నిర్మాతల మండలి బాధ్యులు మాట్లాడుతూ.. తెలంగాణలోని లఘు చిత్ర కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్రస్థాయి మానేటి లఘు చిత్ర పోటీలు నిర్వహిస్తున్నామని, దీనికి సంబంధించి ఎంట్రీలు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జనవరి- 2024 నుంచి నవంబర్- 2024 మధ్య విడుదలైన 10 నుంచి 20 నిమిషాల్లోపు నిడివిగల లఘు చిత్రాల ఎంట్రీలను, రూ. 800 ఎంట్రీ ఫీజుతో కరీంనగర్ ఫిలిం సొసైటీ, ఫిలిం భవన్, కలెక్టరేట్ రోడ్, కరీంనగర్ చిరునామాకు ఈ నెల 15 లోగా పంపాలని సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఫిలిం సొసైటీ, తెలంగాణ లఘు చిత్ర నిర్మాతల మండలి బాధ్యులు సయ్యద్ ముజఫర్, మాడిశెట్టి గోపాల్, అశోక్ రావు, చిరంజీవా రెడ్డి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు కీలకం

- ఎస్పీ అఖిల్‌మహాజన్
- పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం

సిరిసిల్ల రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 6: పోలీస్‌శాఖలో హోంగార్డుల సేవలు కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ హాజరై, సాయుధ హోంగార్డు ప్లాటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కవాతు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో హోంగార్డుల సేవలు అమోఘమన్నారు. శాంతిభద్రతలు, ప్రజలకు రక్షణ కల్పించడంతో బాధ్యతాయుతమైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. నిత్యం క్రమ శిక్షణతో పోలీసుల ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. హోంగార్డుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హోంగార్డుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తేవాలని సూచించారు. ఇక్కడ ఆర్ఐలు రమేశ్, మధుకర్, తదితరులు ఉన్నారు.

ప్రజలకు మరింత నమ్మకం కల్పించాలి

ముస్తాబాద్, డిసెంబర్ 6: ప్రజలకు మరింత చేరువ అవుతూ.. పోలీస్‌శాఖపై వారికి మరింత నమ్మకం కలిగేలా చూడాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, 5ఎస్ అమలుతీరు, రికార్డు గది, రైటర్ రూమ్‌ను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య తగ్గించాలన్నారు. తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. తర్వాత పోలీస్‌స్టేషన్ పరిధిలోని వృద్ధులు, మహిళలకు దుప్పట్లు, యువతకు స్పోర్ట్స్ టీషర్ట్స్ అందజేశారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ మొగిలి, ఎస్ఐ గణేశ్, సిబ్బంది ఉన్నారు.

నిరుపేదలకు అండ సీఎంఆర్ఎఫ్

గంభీరావుపేట, డిసెంబర్ 6: అనారోగ్యంతో బాధపడుతున్న పేద వారికి తిరిగి వైద్య ఖర్చులు చెల్లిస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆర్థిక అండగా నిలుస్తుందని మండలాధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు పేర్కొ న్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఆందోళన చెందవద్దని, కార్పొరేట్ స్థాయిలో ఖరీదైన వైద్యం చేయించుకోవాలన్నారు. ఇక్కడ సింగిల్ విండో డైరెక్టర్ రాజవీర్, నేతలు నుసురత్, ప్రభాకర్, రాజులు, శనిగరం శంకర్, తదితరులు ఉన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు

వేములవాడ టౌన్, డిసెంబర్ 6: వేములవాడ బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రంలో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ డాక్టర్ వికాస్‌రావు ప్రారంభించారు. ఇక్కడ గౌరవాధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బ్రాహ్మణ సంఘం నాయకులు డాక్టర్ మధు రాధాకిషన్, గర్శకుర్తి వెంకన్న, మామిడిపెల్లి వెంకటేశం, చొప్పకట్ల దేవేందర్, మధు రఘునందన్, ప్రతాప సుధాకర్, మునుగోటి రాజన్న, బుడెంగారి మహేశ్, కేశన్నగారి చంద్రమోహన్, పారువెల్ల పుల్లయ్య, చర్లపెల్లి సీతారాములు, బీజేపీ నేతలు ఉన్నారు.

బస్సు నిలిపేదెక్కడో!

- నిరుపయోగంగా ప్రయాణ ప్రాంగణం
- ప్రయాణికులకు అవస్థలు

కోనరావుపేటలో నిరుపయోగంగా ఉన్న ప్రయాణ ప్రాంగణం

కోనరావుపేటలో చెట్ల క్రింద బస్ కోసం వేచిఉన్న ప్రయాణికులు

ప్రయాణ ప్రాంగణం వద్ద కాకుండా వేరే చోట ఆగిన ఆర్టీసీ బస్సు

కోనరావుపేట, డిసెంబర్2: మండల కేంద్రంలో ప్రధాన కూడలిలో కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రయాణ ప్రాంగణం ఉంది. కానీ ఆర్టీసీ అధికారులు ప్రాంగణాన్ని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇందుకు ఆర్టీసీ డ్రైవర్లు కూడా ప్రధాన కారణామని చెప్పవచ్చు. బస్సును నడుపుతున్న డ్రైవర్లు ప్రాంగణం ఉన్నచోట బస్సును నిలిపితే బస్సు అక్కడే ఆగుతుందని ప్రయాణికులు బస్టాండ్‌లో వెచిఉంటారు. కానీ ఆర్టీసీ డ్రైవర్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఎండలో బస్సులను నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారడంతో పాటు బస్సును నిలిపేచోట ఉన్న హోటల్స్, ఇండ్లలోకి దుమ్ముధూళీ చేరడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఇంటి నిర్వాహకులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా బస్సు కోసం మండల కేంద్రానికి వచ్చే శివంగాళపల్లి, ఏగ్లాస్‌పూర్ గ్రామస్తులతో పాటు పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. బస్సు కోసం వెచియుండడానికి ప్రయాణ ప్రాంగణంలో కనీస సౌకర్యాలు లేక చెట్ల క్రింద నిరీక్షిస్తున్నారు. ప్రధానంగా బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లు ఇతరులకు ప్రయోజనకరంగా మారాయి. దీంతో మహిళ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ప్రయాణికులకు అవస్థలు..

మా గ్రామంలో బస్టాండ్‌ను పూర్తిగా తొలగించారు. వివిధ గ్రామాల నుంచి వస్తున్న ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. బస్ కోసం వస్తే కూర్చొడానికి ప్రయాణ ప్రాంగణం లేకుండా పోయింది. దీంతో మహిళలు, ప్రయాణికులు చెట్ల కింద కూర్చుంటూ అపసోపాలు పడుతున్నారు. ప్రధానంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ప్రయాణికుల కష్టాలు తీర్చాలి.

-కుమ్మరి బిలీప్, మరిమడ్ల(కోనరావుపేట)

మెడికల్ ఆఫీసర్‌గా సారియా అంజుమ్

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 6: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా సారియా అంజుమ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ధర్మానాయక్ పీహెచ్‌సీ నుంచి బదిలీపై వెళ్లిపోగా, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్‌గా స్రవంతి కొనసాగుతున్నారు. ఆమె స్థానంలో పూర్తి స్థాయిలో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరిన అంజుమ్‌కు మెడికల్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇల్లంతకుంట, డిసెంబర్ 6: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ టీచర్ చిట్టి ఆనందరెడ్డి తల్లి లచ్చవ్వ మరణించగా, బాధిత కుటుంబాన్ని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ శుక్రవారం పరామర్శించారు. అంత్యక్రియల్లో పాల్గొని, సదరు కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. ఇక్కడ నాయకులు భూంపెల్లి రాఘవ రెడ్డి, పసుల వెంకటి, రమేశ్, బాలపోచయ్య, వినయ్, గురువారెడ్డి, తిరుపతి, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీలు

వేములవాడ రూరల్, డిసెంబర్ 6: వేములవాడ మండలంలో ఎమ్మార్పీస్ నూతన ఇన్‌చార్జిలను నియమించినట్లు జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా కొమ్ము శంకర్, అధ్యక్షుడిగా జింక శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పడిగెల బాబు, కట్కూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, కార్యదర్శులుగా శేఖర్, జనార్దన్, సంయుక్త కార్యదర్శులుగా ప్రేమ్, ప్రవీణ్, రాజు, ప్రచార కార్యదర్శులుగా రవి, రాజమల్లును ఎన్నుకున్నారు. ఇక్కడ నాయకులు ఆవునూరి లచ్చయ్య, తర్రె శంకరయ్య, మల్లయ్య, ప్రతాప్, తదితరులు ఉన్నారు.

ఘనంగా హోంగార్డ్స్ రైజింగ్ డే

రాంనగర్, డిసెంబర్ 6: కరీంనగర్ కమిషనరేట్‌లో శుక్రవారం హోం గార్డ్స్ రైజింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ.. పోలీస్ శాఖలోని అన్ని విభాగాల్లో హోంగార్డులు సేవలందిస్తున్నారని తెలిపారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు పేరు తీసుకురావాలని సూచించారు. కమిషనరేట్ వ్యాప్తంగా కేటాయించిన విధుల్లో ప్రతిభ చూపిన 15 మంది హోంగార్డులను గుర్తించి, వారికి ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు మానేరు విద్యార్థులు

కొత్తపల్లి, డిసెంబర్ 6 : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నేటి నుంచి మూడు రోజులపాటు జరుగనున్న 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు మల్లేశ్, మన్విత ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతరెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, మహేందర్, జహదా, శిరీషతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మిల్లులను పరిశీలించిన అధికారులు

తిమ్మాపూర్, డిసెంబర్6: రైస్ మిల్లుల్లో పొల్యూషన్ తగ్గించుకోవాలని పొల్యూషన్ బోర్డ్ అధికారులు మిల్లర్లకు సూచించారు. అలుగునూర్‌లోని పలు రైస్ మిల్లులను పొల్యూషన్ బోర్డు అధికారులు శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన జాప విజయ భాస్కర్ రెడ్డి, మల్లారెడ్డి అనే వ్యక్తులు గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ, విజయలక్ష్మి, ఓంకార్ మిల్లులతో కలిగే కాలుష్యంపై పొల్యూషన్ బోర్డ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అధికారులు మిల్లులను తనిఖీ చేసి, వాటి నుంచి వచ్చే వ్యర్థాలతో గాలి, నీటి కాలుష్యం జరుగుతున్నదని ప్రాథమికంగా గుర్తించారు. మిల్లులను పరిశీలించి, అక్కడి పరిస్థితులపై సమాచారం సేకరించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. పొల్యూషన్ బోర్డ్ ఈఈ భిక్షపతి, ఏఈ వీరేశంతో పాటు ఫిర్యాదు దారులు ఉన్నారు.